

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 20 ఆగస్టు, 2023 సంచిక : 3

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
రెండు సంవత్సరాలకు చందా..రూ॥200/-
10 సం.రాలకు చందా....... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

Online Donations :
SRI SAI SEVA SAMITHI TRUST
A/c No.62002652136
SBI Keesara Branch,
IFSC Code : SBIN 0020639

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .................. 2
శీలం యొక్క గొప్పదనము .......... 5
మానవతామూర్తి స్వర్గీయ .......... 8
ముక్తి ప్రాప్తించుగాక! .......... 12
శాశ్వత ధర్మగోప్త .......... 17
సాయిభక్త దాసగణు .......... 20
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 23
జ్ఞానోదయమే జీవన .......... 25
మాతృసంస్థ కబుర్లు .......... 28
కోదండ రామసాయి .......... 31


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







## మా వాణి



సూర్యుడు పగటి వెలుగు. రేరాజు రాత్రి వెలుగు. కానీ, ఆ వెలుగులు ఆయా వేళలలోనే ఉంటాయి. వెలిగే దివ్వెలకు ఆధారం తైలం. అది అయి పోయిన మరుక్షణం వెలుగుండదు. మరైతే ఆరని వెలుగేది? లోలోపల వెలిగేదే అసలు వెలుగు. అది జ్ఞాన దీప్తి. జ్ఞానదీప్తికి మూలం సంస్కారం. శాస్త్రాలు, వేద వేదాంతాలు, ఎన్నెన్నో మహద్గ్రంథాలు చదివితే కలిగేది విషయ పరిజ్ఞానం. ఇది ఒక్కో గ్రంథం చదువుతున్న కొద్దీ వికసించనూ వచ్చు. ఒక్కో గ్రంథం ఒక్కో వైపుకు లాగుతోంటే గందరగోళంలోబడి ప్రక్క దారులు పట్టనూ వచ్చు. కేవలం విషయ పరిజ్ఞానాన్నే విద్య అనుకోవడానికి వీలు లేదు. అదే విద్యయితే నేటి మన సమాజం అంతా ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, టీచర్లు, సైంటిస్టులు వగైరా వగైరా విద్యావంతులతో నిండి ఉన్నదనుకోవాలి. కవులకూ, మేధావులకూ, కళాకారులకూ కూడా కొరవ లేదు. అయినాగానీ దేశం చిమ్మ చీకట్లోనే ఉండిపోయినట్లుగా ఉంది. కారణం? ఇవేవీ వెలుగిచ్చే చదువులు కావు గనుక. మరి వెలుగెలా వస్తుంది? సంస్కారవంతమైన విద్య వలన - ధార్మికమైన నడవడి వలన, తరతరాల సంస్కృతినీ, విలువలనూ కాపాడుకొంటూ జీవించటం వలన. మరి ఇవెలా వస్తాయి? అచ్చపు విద్యల వలన. "చదువులలో గల మర్మమెల్ల చదివితి' నన్న మాదిరి విద్యల వలన.

"విద్యా దదాతి వినయం వినయాత్ యాతి పాత్రతా,
పాత్రత్వాద్ధన మాప్నోతి, ధనాద్ధర్మం తతస్సుఖమ్"

- విద్య వలన వినయం, వినయం వలన యోగ్యత, యోగ్యత వలన సంపద, దాని వలన దానధర్మాలు చేసే శక్తి, వాటి వలన సుఖం (అలౌకిక)

లభిస్తాయన్నది ఆర్యవాక్కు. ఒక మనిషి సంస్కారం వేటి వలన నిర్ణయిస్తాము? ఆ వ్యక్తి మాట తీరు, వేష భాషలు (ఇది కొంతవరకే) పరోపకార గుణం, వినయం, దేశభక్తి, స్థిరచిత్తం, ప్రేమ, స్నేహం - వీటన్నింటి ద్వారా సంస్కారం బయటపడుతుంది.

కొందరు వ్యక్తులు తమను గూర్చి తాము చాలా ఘనంగా భావించు కొంటుంటారు. ఏదో లోపల్లోపల భావించుకోవటమే కాదు. పైకి చెప్పకొంటుంటారు కూడా. ప్రతి మనిషీ తన జీవితంలో ఏదో కొంత ఘనత చదువులోనో, ఉద్యోగ జీవితంలోనో, కళల్లోనో, సంసారంలోనో సాధించే ఉంటాడు. ఆ ఘనత తనకు మనోబలాన్నీ, ఆనందాన్నీ కలిగించి ఆపై జీవితంలో ప్రోత్సాహం అందించీ ఉండవచ్చు. అంతమాత్రాన అదేమీ మానవ జీవిత సాఫల్యం కాదు గదా! ముక్తి మార్గానికి చివరి మెట్టు కాదు గదా! అది మర్చిపోయి, ఆ ఘనతకే ఎంతో పొంగిపోతూ పదేపదే వాటి గురించే వినే వాళ్ల చెవులు హోరెత్తేలాగా, వాళ్లకు కంఠస్థం వచ్చేలాగా చెప్తూ ఉంటారు. అలా చెప్పగా చెప్పగా నిజంగానే మహా ఘనులమనే భావన తమ మనస్సుల్లో పాతుకొనిపోతుంది. ఇక ఆ మాయ నుండీ బయటకు రావటం చాలా కష్టం.

రావణుడు మహా బలశాలీ, గొప్ప రాజనీతిపరుడూ, పరమ మహేశ్వరు డున్నూ. కానీ, గొప్ప అహంభావి. తన ఎదురుగా రణరంగంలో నిలచిన శ్రీరాముడిని చూచి ఆయన అన్నాడట. "ఓరీ బక్క మానవా, నీవా నన్ను గెలిచేది! అన్యాయంగా చచ్చిపోతావు. వెనక్కు తిరిగి వెళ్లిపో"-అని. అందుకు జవాబుగా రాముడిలా అన్నాడట. "మా రాజ్యంలో మూడు రకాల వృక్షాలుంటాయి. కొన్ని పూలు పూస్తాయిగానీ కాయలు కాయవు. కొన్ని పుష్పిస్తాయి, ఫలిస్తాయి కూడా. మరికొన్ని చెట్లు చాలా అరుదైనవి. అవి పుష్పించవు. తిన్నగా కాయలే కాస్తాయి. అలాగే మనుష్యుల్లో కూడా కేవలం మాటల మనుషులు, మాటలూ, చేతలు రెండూ వచ్చినవారు, వాక్శూరులు





కాకుండా కేవలం కర్మయోగులు-ఇలా మూడు రకాలు ఉంటారు. యుద్ధ రంగాన మాటలతో పని ఏమున్నది?" దీన్నిబట్టి కార్యశీలుడైనవాడు పొదుపుగా మాట్లాడతాడనీ, ముఖ్యంగా తన ఘనతను చెప్పకోడనీ తెలుసుకోగలం.

అంతేకాదు-సంస్కారవంతుడు ఒక్కొక్కరోజు ఒక్కోలాగా ప్రవర్తించడు. స్థిరచిత్తంతో ఉంటాడు. తాను చేసే మంచి పనిని భూతద్దంలో చూచుకొని పొంగిపోవటం, ప్రకటించుకోవటం చేయడు. అలాగే స్వప్రయోజనాన్నీ, స్వసుఖాన్నీ లెక్కచేయడు. తానెంత ఎత్తుల కెదిగినా గతాన్నీ, మూలాన్నీ మరచిపోడు. దైవాన్నీ, దేశాన్నీ సమభావంతో ప్రేమిస్తాడు. మనం సాయిభక్తులం. "బాగాగారిష్టం అంతా" అంటాం. "బాబా చెప్పినట్లే ఆచరిస్తున్నామ"ని భావిస్తాం. దీన్ని నిశితంగా విశ్లేషించి చీల్చి చూస్తే "మనం నిజంగా అలా ఉన్నామా? ఆత్మవంచన చేసుకుంటు న్నామా? లేదా?" అన్నది తెలుస్తుంది.

వినయం, సంస్కారంలో ఒక ముఖ్యభాగంగా చెప్తారు పెద్దలు. మనం ఎవరికైనా ఏదైనా సేవ చేస్తున్నపుడు తల్లిదండ్రుల సేవైనా సరే - అవతలి వాడు భగవత్స్వరూపుడన్న భావంతో చేస్తున్నామా, ఎవరి మెప్పల కోసమైనా కృతజ్ఞత కోసమైనా చేస్తున్నామా, తప్పదని చేస్తున్నామా - ఆత్మానందం కోసం చేస్తున్నామా - అన్న విశ్లేషణ అవసరం. మనమెంత; మన స్థాయి ఎంత, యీ విశాల విశ్వంలో? ఇక విశ్వవిభుని చెంత ఇంకెంత? అలా తరిచి చూస్తే అహం నశించి వినయమే పెరుగుతుంది. అది కూడా నిజాయితీతో చూస్తేనే సుమా!

మొత్తం మీద ఇటువంటి శుభగుణాలున్న విద్యే లోవెలుగవుతుంది. ఆరని వెలుగవుతుంది. మనకున్న డిగ్రీలన్నీ కలిసి ఒక్క వెలుగురేఖనైనా ఇవ్వలేవు. అంచేత అటువంటి గొప్ప విద్య నేర్చుకొనే ప్రయత్నం మొదలు పెడదాం.

# శీలం యొక్క గొప్పదనము

- స్వామీజీ

ఏ మనిషికైనా ప్రజల నుండి గౌరవాదరాలు, సుఖశాంతులు దొరికేది అతని మంచి ప్రవర్తన వలననే. దీన్నే మంచి శీలము అంటారు. శీలము లేని వానికి ధనము ఉన్నా, అధికారము ఉన్నా, ప్రజలు కొంత గౌరవించి నట్లు కన్పిస్తారు కాని, అది మనస్ఫూర్తిగా కాదు. అది నిజమైన గౌరవం కాదు. ఆ సంపద ఎక్కువకాలం నిలకడగా నిలవదు కూడా.

శీలం వలన కలిగే గొప్పదనము ఏమిటో, దాన్ని పోగొట్టుకుంటే వచ్చే నష్టమేమిటో తెలియజేసే ఒక మంచిగాథ భారతగ్రంథంలో ఉంది. ధృతరాష్ట్రుడు తన కుమారుడైన దుర్యోధనుని మనస్సు మార్చే ప్రయత్నంలో ఈ గాథను చెప్పాడు :

హిరణ్యకశ్యపుడనే మహా పరాక్రమశాలి, తపశ్శాలి అయినా విష్ణుద్వేషి అయిన రాక్షసరాజు ఉండేవాడు. అతని కుమారుడే ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు తల్లి గర్భంలో ఉన్నప్పడే అదృష్టవశాత్తూ నారద మహర్షి వలన భగవంతుని కథలు విన్నాడు. అంచేత పుట్టకముందే భగవద్భక్తి పెరిగింది. దాంతోపాటు మంచి గుణాలు కూడా అలవడ్డాయి. పసితనంలోనే గొప్ప భక్తుడై తండ్రిలోని రాక్షస లక్షణాలను ఎదిరించి గెలిచి నిలిచాడు. అన్ని విద్యలను శ్రద్ధగా నేర్చుకుని సమర్థుడైనాడు. జనరంజకంగా పరిపాలించటమేగాక స్వర్గం మీద కూడా దండెత్తి ఇంద్రుణ్ణి తరిమివేసి ముల్లోకాలను ధర్మయుక్తంగా పరిపాలించటం ప్రారంభించాడు. పదవిని పోగొట్టుకొన్న ఇంద్రుడు తనకు ముల్లోకాధిపత్యం మళ్ళీ ఎలా వస్తుందో చెప్పవలసిందని తన గురువైన బృహస్పతిని ప్రార్థించాడు. ఈ విషయంలో భార్గవుణ్ణి అడగమని బృహస్పతి సూచించాడు.

ఇంద్రుడు వెళ్ళి భార్గవుణ్ణి ఆశ్రయించాడు. "నిన్ను ఇంత అవలీలగా జయించే శక్తి మల్లోకాలను యింత రంజకంగా పరిపాలించే శక్తి అతనికి





ఎలా వచ్చిందో అతన్నే అడిగి తెలుసుకొని ఉపాయంగా ఆ శక్తిని అడిగి పుచ్చుకొమ్మ"ని సలహా యిచ్చాడు భార్గవుడు.

ఇంద్రుడు బ్రాహ్మణ వేషం ధరించి ప్రహ్లాదుడి దగ్గర శిష్యుడిగా చేరి భక్తితో సేవలు చెయ్యటం ప్రారంభించాడు. ఈ విధంగా చాలాకాలం సేవలు చెయ్యగా చెయ్యగా ప్రహ్లాదునికి అతని మీద దయ గలిగింది.

"నానా, దేనిని కోరి నీవు ఇంతగా నన్ను సేవిస్తున్నావు?" అని ప్రహ్లాదుడు ప్రశ్నించాడు.

"అయ్యా, మీకు ఈ ముల్లోకాలను (స్వర్గ, మర్త్య, పాతాళాలను) పరిపాలించే అవకాశం, శక్తీ ఎలా వచ్చాయో తెలుసుకోవాలని కోరికగా ఉందన్నాడు ఆ కపట బ్రాహ్మణుడు. "ఇదేమీ పెద్ద రహస్యం కాదు. నేనెప్పుడూ రాజుననే గర్వంతో ప్రవర్తించను. నా ప్రవర్తన ద్వారా ఎవ్వరినీ నొప్పించను. ఈర్ష్య, అసూయ, పగ, ద్వేషం వంటి దుర్గుణాలను వేటినీ మనస్సులోనికి రానివ్వను. త్రికరణ శుద్ధిగా (ఏది ఆలోచిస్తానో అదే చెప్పటం, ఏది చెబుతానో దాన్నే ఆచరించటం) ప్రవర్తిస్తాను. నాకు ఎవరు ఏ చిన్న మేలు చేసినా దానికి ప్రతిఫలంగా ఎన్నో రెట్లు మేలు చేస్తాను. ఎవరేది అడిగినా లేదనకుండా సంతోషపెడతాను. నా పూర్వ పుణ్యం వలన బ్రహ్మర్షులు మెచ్చుకొనే శీలం నాకున్నది. ఈ కారణం చేతనే నాకింతటి మహోన్నత పదవి లభించింది" అన్నాడు ప్రహ్లాదుడు.

"అయ్యా! నీవు నిజంగా మహాత్ముడవు, దానశీలివి. నాయందు దయ తలచి నీ శీలాన్ని నాకు ప్రసాదించు" అని ఇంద్రుడు దీనంగా వేడుకున్నాడు.

ఈ యాచనలోని కపటం గ్రహించని ప్రహ్లాదుడు అతని వేడికోలుకు కరిగిపోయి "సరే" అన్నాడు.

ఇంద్రుడు పన్నిన పన్నాగానికి బలి అయినాడు ప్రహ్లాదుడు. ఆ వెంటనే ప్రహ్లాదుడి శరీరంలోంచి మహాతేజస్వి అయిన ఒక పురుషుడు బయటకు వచ్చాడు.

అతనిని చూచి ప్రహ్లాదుడు "నీవెవరు" అని ప్రశ్నించాడు. "నేను నీ

శీలాన్ని నీవు నన్ను ఆ విప్రునికి దానం చేశావు గదా! అందుచేత నేను అతని దగ్గరకు వెళ్ళిపోతున్నాను" అంటూ వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు ఆ దివ్యపురుషుడు.

అతని వెనుకనే ప్రహ్లాదుని శరీరంలోంచి ఒక్కొక్క వెలుగూ బయటకు వెళ్ళిపోవటం ప్రారంభించాయి.

ఒక్కొక్క వెలుగూ రావటమూ ప్రహ్లాదుడు ఆశ్చర్యంగా అడగటమూ

ప్రహ్లాదుడు : "నీవెవరు మహానుభావా?"

నేను సత్యాన్ని, శీలము ఎక్కడుంటే అక్కడే దాన్ని ఆశ్రయించుకొని ఉంటాను. శీలం పోయిందిగా! నేను పోతున్నాను"

ఇంకో తేజస్సు బయటకు వచ్చింది.

"నువ్వెవరు మహాశయా?"

"నేను ఋజువర్తనము (నిష్కాపట్యాన్ని) సత్యాన్ని ఆశ్రయించి బ్రతుకుతాను. నేనూ పోతున్నాను".

"నీవెవరు మహానుభావా?"

"నేను బలాన్ని సత్త్వవర్తన ఉన్నచోటనే నేనూ ఉంటాను. నేనూ పోతున్నాను"

ఇలా ఒక్కొక్క తేజస్సూ బయటకుపోతుంటే దిగులుపడి నీరసించి ప్రహ్లాదుడు దుఃఖంతో కుములిపోతున్నాడు. ఇంతలో ఒక గొప్ప సౌందర్యవతి అయిన స్త్రీ మూర్తి అతని శరీరంలోంచి బయటకు వచ్చింది.

"అమ్మా! నీవెవరు?"

"నేను లక్ష్మిని (సంపదను), బలం ఎక్కడుంటే అక్కడే ఉంటాను. నేను కూడా శీలసంపద లేని నిన్ను వదలి వెళ్ళిపోతున్నాను".

"అయ్యో! తల్లీ! నీవు కూడా నన్ను విడిచి వెళ్ళిపోతున్నావా? ఇంతకూ ఇంత కాలమూ నన్ను వినయంగా సేవించి, నా శీలమును యాచించిన ఆ విప్రుడెవరు తల్లీ!" అని ఆ లక్ష్మీదేవిని అడిగాడు ప్రహ్లాదుడు.





"అతను ఇంద్రుడు. నీ వైభవాన్ని కాజేసిపోవాలనే ఉద్దేశ్యంతోనే వచ్చాడు. నీవాతని మాయలో చిక్కుకొని నీ శీలాన్ని అతనికి ధారపోసావు.

శీలం వలన ధర్మం, ధర్మం వలన సత్యం, సత్యాన్ని అంటి మంచి నడవడి, దాని వెంట బలం, దాన్ని ఆశ్రయించి నేనూ (సిరి) ఉంటాం. కనుకనే అన్నిటికీ శీలమే మూలమని చెబుతారు. నీవు దాన్ని పోగొట్టుకున్నావు. అంచేత నేనిక నీ దగ్గర ఉండటం అసంభవం" అంటూ వెళ్ళిపోయింది శ్రీదేవి".

శీలం యొక్క గొప్పదనాన్ని ఇంతగా వివరించి చెప్పినా దుర్యోధనుడు తండ్రి మాటలను పెడచెవిని పెట్టాడు. సర్వసంపదలూ, చివరికి అర్థాంతరంగా ప్రాణంతోసహా పోగొట్టుకున్నాడు. శీలవంతులైన పాండవులు సకల సంపదలూ పొంది సుఖశాంతులతో జీవితాల్ని గడపగలిగారు.

# మానవతామూర్తి స్వర్గీయ పుల్లారెడ్డిగారు

స్వర్గీయ పుల్లారెడ్డిగారి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. మన జీవితంలో 'మిఠాయి (స్వీట్)' అనే పదం ప్రారంభమైన దగ్గర్నుంచి ఆయన పేరు ఆ పదంతో కలిసే ఉంది. ఒక వ్యాపారవేత్తగా మాత్రమే పుల్లారెడ్డిగారు తెలిసిన వారికి ఆయనలోని మరో కోణం చూపించాలనేదే ఈ ప్రయత్నం.

భాగ్యనగరంలో ఆయనకి అనేక మిఠాయి దుకాణాలున్నాయి (స్వీట్ షాప్స్). అన్ని దుకాణాలలోనూ కలిపి దాదాపు 1000 మంది వరకూ పని చేస్తుండేవారు. ఆయన కుమారుడు, అల్లుడు కూడా వాటిలోనే పనిచేసేవారు. ఆయన తన కొడుక్కి, అల్లుడికి నెలకు ఐదువేల రూపాయలు జీతంగా ఇచ్చేవారు. పెద్దమొత్తాలు ఢిల్లీలోని విశ్వహిందూ పరిషత్ కేంద్రానికి పంపుతూ ఉండేవారు.

కొడుకు ఎప్పుడైనా కాస్త ఎక్కువ డబ్బులు అడిగితే ఒప్పుకునేవారు

కాదు. 'చూడు! మన దగ్గరున్న 1000 మంది ఉద్యోగుల్లో ఎవరికైనా 5000/- (ఐదు వేలు)కు మించి వస్తుందా? వారికి దొరకకపోతే నీకు మాత్రం ఎలా వస్తుంది? పని చేసినంతే అడగాలి' అనేవారు. 'మరి మిగతా డబ్బులు ఏం చేస్తావు? అని కొడుకు అడిగేవాడు. 'అవి సమాజానికి చెందినవి. సమాజానికే ఇస్తున్నాను' అని చెప్పేవారు. అలాగే తన ఆదాయంలో 30% మిగతా సంఘ పరివార క్షేత్రాలకి కూడా ఇచ్చేవారు.

ఆయన నివసించే ఇల్లు కూడా అత్యంత నిరాడంబరంగా ఉండేది. ఇంటికి ఏనాడు టైల్స్ వేయలేదు. సిమెంట్ గచ్చునేలతోనే గడిపారు. భార్యకి గాని, కూతుళ్ళు, కోడళ్ళకుగానీ ఎలాంటి వజ్రపు నగలు ఉండేవి కాదు. పొరపాటున ఎప్పుడైనా అడిగితే నగలనేం చేసుకుంటారు? ఒక్క పూట కూడా కడుపు నిండా తినలేని వాళ్ళు కోట్లలో ఉన్నారు. వారి గురించి ఆలోచించాలి' అని సర్ది చెప్పేవారు.

నిరాడంబరతకి నిలువెత్తు రూపం పుల్లారెడ్డిగారు. కోట్ల రూపాయలు చేతుల్లో ఉన్నా తన బనీను చిరిగిపోతే దాంతో రుమాళ్ళు కుట్టించుకునేవారు.

ఉద్యోగుల కోసం ఏ వంట చేయించేవారో అదే వంటను వారితో కలిసి భార్యాభర్తలిద్దరూ తినేవారు. వేలకి వేలు పెట్టి ధార్మిక గ్రంథాలు కొని తన షాపులో పెట్టి వచ్చే వారందరికీ ఉచితంగా ఇచ్చేవారు. చదవమని ప్రోత్సహించేవారు. ఆయన దినచర్య క్రమశిక్షణతో కూడుకుని ఉండేది.

ఉదయం 6 గంటలకు లేచి 10 గంటల వరకూ పరిచయస్తుల ఇళ్లకు వెళ్ళేవారు. తనతో కొన్ని మిఠాయి పాకెట్లు, కొంత సాహిత్యం, ఇంకా ఒక కార్యకర్తని తీసుకువెళ్ళేవారు. పది వరకు ఆ కార్యక్రమం అయ్యాక షాపుకి వచ్చి సాయంకాలం ఆరు వరకూ షాపులోనే ఉండేవారు. మళ్ళీ సాయంత్రం ఆరు నుంచి 10 గంటల వరకూ గృహసంపర్కం చేసేవారు. ఆ విధంగా ఎనిమిది గంటలు సమాజానికి, ఎనిమిది గంటలు వ్యాపారానికి, మిగతా ఎనిమిది గంటలు తన కోసం, తన నిత్య నైమిత్తిక కర్మల కోసం వాడుకునేవారు.





ఈ రకమైన ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడుపుతూ 88 సంవత్సరాలు జీవించారు. ఆయన పెద్ద కుమారులైన శ్రీ రాఘవరెడ్డిగారు తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ ప్రస్తుతం విహెచ్‌పి అంతరాష్ట్రీయ అధ్యక్షులుగా బాధ్యత నిర్వహిస్తున్నారు.

సంపాదించే శక్తి, అవకాశం భగవంతుడిస్తాడు. కానీ దాన్ని సమాజ హితం కోసం వెచ్చించి సద్వినియోగం చేయడం మనిషి వివేకం మీద ఆధారపడి ఉంటుంది. దాన్నే మనం సంస్కారం అంటాము.

**సమర్పిత భావన - అంకిత భావన**

శ్రీ రామజన్మభూమి కోసం కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడే అశోక్ సింఘాల్‌జీ ఇక్కడకు వచ్చి పుల్లారెడ్డిగారిని కలిసారు. "రెడ్డిగారూ! కేసు నడుస్తోంది. లాయర్ ఫీజుకి చాలా అవుతోంది. ఏం చేయమంటారు?" అని అడిగారు.

అప్పుడు పుల్లారెడ్డిగారు ఆయన్ను లేపి ఇంటి బయటకు తీసుకు వచ్చారు.

బయటినుండి ఆ ఇంటిని చూపిస్తూ 'ఈ ఇల్లు నా స్వార్జితం. దీనిని అమ్మేస్తాను. కనీసం ఐదు కోట్ల రూపాయలు వస్తాయి. అవసరమైనంత తీసుకోండి! సంకోచం వద్దు. ఈ ఇళ్ళు, షాపుల మీద నాకెలాంటి వ్యామోహం లేదు. నేను వెళ్లేలోగా చరిత్ర సృష్టించే ఒక మంచి పనిచేసి, మంచి ఉదాహరణగా మిగిలిపోవాలి అన్నదే నా కోరిక' అని అన్నారు.

చప్పున సింఘాల్‌జీ వంగి ఆయన పాదాలు తాకారు. 'మీరు మామూలు మనిషి కాదు. తప్పకుండా గత జన్మలో ఏ ఋషిగానో, మునిగానో జీవించి ఉంటారు. లేకపోతే మీలో ఇంత వైరాగ్యం రాదు' అన్నారు. ఆ తరువాత కూడా ఎప్పుడైనా ఢిల్లీ కేంద్ర కార్యాలయంలో డబ్బు అవసరం పడినా పుల్లారెడ్డిగారు ఏదో విధంగా సర్దుబాటు చేస్తూనే ఉండేవారు.

**సామాజిక సంపర్కం-ఆయన మొదటి ప్రాధాన్యం**

1991లో శ్రీరామ జన్మభూమికి సంబంధించిన నిజమైన వివరాలతో విహెచ్‌పి ఒక పుస్తకాన్ని ముద్రించింది. ఆ పుస్తకం ఖరీదు 10 రూ.లు.

ఆ సమయంలో రెడ్డిగారు, నేను ఢిల్లీలో ఒక ముఖ్యమైన సమావేశాన్ని ముగించుకొని భాగ్యనగర్ వస్తున్నాము.

నాకు ట్రైన్‌లో రిజర్వేషన్ అయిందని వారిని బయల్దేరమన్నాను. కానీ, నన్ను తనతోపాటు రమ్మని చెప్పి విమాన ప్రయాణం చేయించారు.

అప్పుడు పుల్లారెడ్డిగారు అప్పడే ముద్రించిన పుస్తకాలను 300 ప్రతులను కొనమన్నారు. 3000/-లు రూ.లు ఇచ్చి 300 పుస్తకాలు తీసుకొని విమానంలోకి రమ్మన్నారు. అక్కడకు వచ్చాక 280 పుస్తకాలను పుల్లారెడ్డిగారే స్వయంగా తన చేతుల్తో విమానంలో అప్పటికే ఆశీనులైన ప్రయాణీకులకు పంచారు. ఆ రోజుల్లో కేవలం ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్, జడ్జీలు, ఎం.పి.లు లాంటి ప్రముఖులు మాత్రమే విమాన ప్రయాణం చేసేవారు. వారందరి ఇంటింటికి వెళ్ళి కలిసి పుస్తకం ఇవ్వడమంటే అనేక నెలలు పట్టేది. నేడు అర్థగంటలో ఆ పని పూర్తయిందని రామజన్మభూమి ఉద్యమానికి అందరూ సహకరిస్తారని, ఎవరూ వ్యతిరేకించరని నాతో చెప్పారు పుల్లారెడ్డిగారు. ఈ పనికి ఎంతో సంతోషపడ్డారు.


విమానం బయలుదేరి గమ్యం చేరాక దిగేటప్పుడు ఇద్దరం మెట్ల వద్ద నిలబడ్డాం. విమానం దిగి వస్తున్న వారు పుల్లారెడ్డిగారి చేయి పట్టుకుని ధన్యవాదాలు చెపుతూ మీరు చాలా మంచి పుస్తకం ఇచ్చారు. మాకు ఇంతటి సమాచారం మరెక్కడా లభించదు కూడా. ఇప్పడు మాకు విషయం అర్థమైంది. ఈ విషయంలో మేము మీకు తప్పక సహకరిస్తాం అన్నారు. పుల్లారెడ్డిగారు విమానంలోని ప్రముఖుల చిరునామా కార్డులు (విజిటింగ్ కార్డులు) 200 సేకరించారు. మరునాటి నుండి ఆ కార్డుల ఆధారంగా ఆ 200 మందికి ఫోను చేస్తూ, పరిచయం పెంచుకున్నారు. ఆ సంభాషణలో జరుగుతున్న విషయాలు తెలపడం, తెలుసుకోవడం చేసేవారు. ఇలా సమాజంలోని ప్రతి వ్యక్తిని కలిసి, వారితో సత్సంబంధాలు పెంచుకొనేవారు. వారిని సమాజ కార్యంలో ఎక్కడో ఒకచోట లింకు చేసేవారు. మంచిని పంచాలి, పెంచాలి. దానినే జీవిత లక్ష్యంగా పెట్టుకొని జీవించారు వారు.







# ముక్తి ప్రాప్తించుగాక!



కాశీ క్షేత్రంలో కాటికి కాలు చాచిన వయస్సులోనూ బతుకుతెరువు కోసం వ్యాకరణ పాఠాలు వల్లె వేస్తున్న ఓ సంసారిక జీవిని చూసి జగద్గురువు శంకరభగవత్పాదులు ఆశ్చర్యావేదనలకు లోనయ్యారు. ఆశువుగా **'భజగోవిందం... భజగోవిందం'** అంటూ మేడిపండు లాంటి లోకం పోకడ గుట్టువిప్పి చూపించారు. ముక్తాయింపుగా ముక్తిమార్గాన్నీ ప్రబోధించారు. ఆదర్శగురువై ఆదిశంకరాచార్యులు తనదైన రీతిలో ఈ శ్లోకపరంపరను కొనసాగించారు. తప్పటడుగులు వేస్తున్న తనయుడిని చూసి తండ్రి హెచ్చరించిన తీరులో, ఆశామోహాల్లో పడి అపసవ్య దిశలో ప్రయాణిస్తున్న మానవుడిని అప్రమత్తం చేశారు. 'మూర్ఖుడా!' అంటూ కడు కఠినంగా తమ సందేశానికి శ్రీకారం చుట్టి, తరువాత మనం ఎక్కడ నిరాశలో కూరుకుపోతామోనని 'ఓ తమ్ముడా!' అంటూ ఆత్మీయతతో ప్రియ సోదరుడై అనునయించారు. అడ్డదారుల్లో వెళుతున్న అవివేకుల్ని అసలు దారిలోకి తెచ్చే ప్రయత్నం చేశారు. చివరకు సమర్థుడైన గురువులా 'నీకేం భయం లేదు; నీవూ తరించే మార్గముంది!' అంటూ అభయమిచ్చారు.

**గురుచరణాంబుజ నిర్భరభక్తః, సంసారా దచిరాద్భవ ముక్తః**
**సేంద్రియమానస నియమాదేవ; ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్**

'గురుచరణ కమలాలపై మిక్కిలి భక్తి గల ఓ సాధకుడా! ఈ సంసార బంధనాల నుంచి శీఘ్రంగానే ముక్తిని పొందెదవు గాక! నీ ఇంద్రియాలనూ, మనస్సునూ అదుపులో పెట్టినవాడవై నీ హృదయంలోనే ఉంటున్న భగవంతుడిని దర్శించెదవు గాక!' అంటూ ఆశీఃపూర్వకంగా స్వస్తి వచనాలు పలికారు. శిష్యసమేతంగా గానం చేసిన 'ద్వాదశ మంజరికా

స్తోత్రం', 'చతుర్దశ మంజరికా స్తోత్రం' సారాన్నంతా శంకరాచార్యులు ఈ 'భజ గోవిందం' ముగింపు శ్లోకంగా చెప్పారు.

**గురుభక్తే తరించే మార్గం :** గురుచరణాలపై భక్తి ప్రపత్తులతో మెలిగే సాధకుడు సులువుగా సంసార బంధాల నుంచి విముక్తిని పొందుతాడని జగద్గురువులు స్పష్టం చేస్తున్నారు. మన సనాతన ధర్మంలో గురువుకు అత్యున్నత స్థానం కల్పించారు. సాక్షాత్తూ భగవంతుడు కూడా శ్రీరామకృష్ణ పరమహంస, రమణమహర్షి తదితర అవతారాల్లో గురువై ఎందరో శిష్య ప్రశిష్యులతో ధర్మసంస్థాపన గావించాడు. అందుకే విష్ణు సహస్ర నామాల్లో భీష్మాచార్యులు భగవంతుడిని **'గురుర్గురుతమో ధామ, సత్యస్సత్య పరాక్రమః...'** అంటూ కీర్తించారు. గురువులలో కెల్లా పరమగురువు భగవంతుడని ప్రస్తుతించారు. అలాంటి గురువు పాదాలను నమ్ముకొని, శరణాగతితో ముందుకు వెళితే లౌకికబంధాలు వాటంతట అవే సడలిపోతాయి. ఒకసారి శ్రీరామకృష్ణ పరమహంసతో ఓ భక్తుడు 'గృహస్థులకు భగవద్దర్శనం కలుగుతుందంటారా?' అన్న సందేహాన్ని వ్యక్తం చేశాడు. అప్పుడు శ్రీరామ కృష్ణులు "తప్పకుండా అందరికీ ముక్తి కలుగుతుంది. గురువు ఉపదేశం మేరకు నడుచుకోవాలి. పెడదోవ పడితే తిరిగి రావడం చాలా కష్టం. ముక్తి కలగడానికి సుదీర్ఘకాలం పడుతుంది. మనస్సులో భగవంతుణ్ణి నిలుపుకొని నిత్యకర్మలను చేస్తే సులభంగా ముక్తి లభిస్తుంది. ఒక వ్యక్తి గురువు రూపంలో వచ్చి ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేస్తున్నాడంటే, ఆ సచ్చిదానందుడే ఈ రూపం ధరించాడని గ్రహించు. నిన్ను చేయి పుచ్చు కొని నడిపించే సహచరుని లాంటివాడు గురువు' అంటారు.

**ఆత్మతత్త్వ ప్రబోధకుడే ఆచార్యుడు :** సత్ప్రవర్తన స్వాధ్యాయం, భగవద్భక్తి, ధ్యానం తదితర సత్ క్రియలన్నీ భగవదనుభూతికి అవసరమైనవి. బోధ





గురువులందరూ వీటన్నింటిలో శిక్షణనిచ్చి లోకాన్ని చూపిస్తే, ఆచార్యుడైన గురువు మనకు పరమతత్త్వాన్నీ, ఆత్మతత్త్వాన్నీ అనుగ్రహిస్తాడు. అలాంటి గురువుల మార్గదర్శకత్వంలో జీవితాల్ని ఉద్ధరింప చేసుకోవాలి. అయితే ఆధునికకాలంలో అంత జిజ్ఞాస కలిగిన శిష్యులు, అంత ఆధ్యాత్మిక శక్తి సంపత్తులైన గురువులు లుప్తమవుతున్నారు. సంసార లంపటం నుంచి, మానసిక సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు ఎన్నో తాత్కాలిక పరిష్కారాలు వెతుక్కునేందుకు ఆధునికులు వెంపర్లాడుతున్నారు. వారి బలహీనతల్ని ఆసరాగా చేసుకొని చిలకపలుకుల్లా నాలుగు సాంత్వన వచనాల్ని పుక్కిటపట్టి కొందరు అవకాశవాదులు గురువులుగా ప్రచారం చేసుకుంటూ ఆకర్షిస్తున్నారు. నిజానికి ఇలాంటి కుహనా గురుశిష్యులకు జ్ఞానం వంటబట్టదు; వంటబట్టినా జీవితానికి ఉపయోగపడదు. అందుకే కఠోపనిషత్తు ....

**నా విరతో దుశ్చరితాన్నాశాంతో నా సమాహితః।**

**నా శాంత మానసోవాపి ప్రజ్ఞానేనైన మాప్నుయాత్॥**

'చెడు ప్రవర్తన నుంచి బయటకు రాలేనివారూ, ఇంద్రియ లౌల్యాన్ని నిగ్రహించుకోలేని వారూ, ధ్యానపరులు కాని వారూ, ప్రశాంతమైన మనస్సు లేనివారూ జ్ఞానం చేత కూడా ఆత్మను అర్థం చేసుకోలేరని తేల్చి చెప్పేసింది. ఇలా గురువులైనా, శిష్యులైనా మౌలికంగా కొన్ని అర్హతలను సము పార్జించాలి.

**నిగ్రహంతోనే అనుగ్రహం :** పారమార్థికంగా లబ్ధిని పొందాలంటే ఈ పాంచభౌతిక శరీరం నియమనిష్ఠలను, నిగ్రహాన్ని పాటించాలి. అరుణా చల ఆశ్రమంలో ఒకనాడు భగవాన్ రమణమహర్షిని ఓ భక్తుడు, 'మహాత్మా! పశువులాగా బతుకుతున్నానే! నేను ఎదిగేది ఎలా?' అని ప్రశ్నిం

చాడు. అప్పుడు భగవాన్ రమణులు 'నాయనా! ఇంద్రియాల కన్నా, మనస్సు కన్నా బలమైన శక్తిని మేల్కొల్పడం వల్లనే ఇది జరుగుతుంది. నీలో ఉన్న ఆ శక్తిని మేల్కొలిపి, పెంపొందించుకోగలిగితే అన్నింటినీ జయించవచ్చు. ధ్యానధారను నిరంతరాయంగా కొనసాగించాలి. మితమైన ఆహారం తీసుకోవడం వల్ల, ఇతర నియమాలను పాటించడం వల్ల సమభావాన్ని నిలుపుకోవచ్చు. నీవు శరీరంతో తాదాత్మ్యం చెందినంతకాలం లైంగిక భావాలనూ, ఇతర ఆకర్షణలనూ తప్పించుకోలేవు' అంటారు.

శంకరాచార్యులు కూడా తమ 'భజ గోవిందం' చివరి శ్లోకంలో 'సేంద్రియమానస నియమాదేవం....' అన్నారు. కానీ మనలో చాలామంది ఇలాంటి ప్రాథమికమైన సాధనలు ఏవీ చేయకుండానే ఏదో ప్రాప్తించాలనుకుంటున్నారు. అందువల్లే 'యోగ' పేరుతో ఎన్ని ఆసనాలు వేసి ఒళ్ళు వంచినా, 'ధ్యానం' పేరిట ఎన్ని తరగతులకు వెళ్ళి కళ్ళు మూసుకొని కూర్చున్నా, అటు నేర్పే వారికీ, ఇటు నేర్చుకునే వారికీ ప్రయోజనం కలగదు. ముందు నిత్యజీవితంలో కొన్ని అలవాట్లను నియంత్రించుకోవాలి; సరళమైన నడవడికను అలవరచుకోవాలి. బహిర్ముఖ సంకల్పాలను తగ్గించుకుంటూ ఉండాలి. మానసిక, శారీరక నియంత్రణ ఓ వైపు, ఆధ్యాత్మిక సాధనలు మరోవైపు సమాంతరంగా సాగిపోవాలి.

**ఆయన అంతర్యామి :** బాహ్య, అంతర సాధనలన్నీ పూర్తయ్యాక ఆ భగవంతుడు వేరెక్కడో లేడనీ, అంతర్యామిగా ఆయన మన హృదయంలోనే నెలకొన్నాడనీ అర్థమవుతుంది. అంతరాత్మగా ఆ సర్వేశ్వరుడు సతతమూ మనకు సన్మిత్రుడై దోవ చూపుతూనే ఉంటాడని స్ఫురిస్తుంది. అద్దం లాంటి కొలనులో అందమైన చందమామ ప్రతిబింబించినట్లు, అంతశ్శుద్ధి కలిగిన మనస్సులో మాధవుడు ప్రతిష్ఠితమవుతాడు. అదే భక్తి





భావంతో శ్రీరామచంద్రమూర్తిని స్తుతిస్తూ **'అన్ని నీవనుచు అంతరంగమున ... తిన్నగ వెదకి తెలుసుకొంటినయ్య, నిన్నె గాని మది నెన్నజాల నొరుల...'** అంటారు శ్రీ త్యాగరాజస్వామి. అయితే ఇంతటి అత్యున్నత ఆధ్యాత్మిక స్థితికి చేరుకోవాలంటే పరోక్షంగా భగవంతుడి కృప, ప్రత్యక్షంగా గురువరేణ్యుల కటాక్షం మనపై ఉండాలి. ఆ భగవంతుడిని పుణ్యక్షేత్రాలకూ, దేవాలయాలకే పరిమితం చేస్తూ ఉంటారు. ఆయనను సర్వాంతర్యామిగా దర్శించుకోలేరు. అలా సర్వేశ్వరుడు సర్వాంతర్యామి అని అనుకోలేనంత కాలం ఆయనతో మనకు నిజమైన బాంధవ్యం ఏర్పడదు. మనకు ప్రియమైన వాళ్ళు ఎంత దూరంలో ఉన్నా, తలచుకొనగానే ఏదో తెలియని ఆనందం కలుగుతుంది. అలాగే ఆ దేవదేవుని దివ్యస్మృతే మన మనస్సును ఆనంద సీమల్లో విహరింపజేయాలి. తిరుపతి కొండకు వెళ్ళకుండానే తిరుమల వాసుడిని గుండెలో దర్శించుకోగలగాలి; అదీ భగవద్భక్తి అంటే! అందుకే 'ఎవరైతే నేను షిరిడీలో మాత్రమే ఉన్నానని అనుకుంటారో, వారు నన్ను నిజంగా గ్రహించలేదని తెలుసుకో!' అంటారు షిరిడీ సాయిబాబా. ఇలాంటి పారమార్థిక పరమోన్నత స్థితికి చేరుకునే ప్రస్థానంలో జగద్గురువులు శంకరాచార్యుల సన్మార్గ ప్రబోధక దివిటీలను చేపట్టి ముందుకు సాగిపోతే ఈ సంసారకూపంలో కూరుకుపోకుండా, ఆ ఆపద్బాంధవుడే ఆదుకుంటాడు.

**ముక్తి మిచ్ఛసి చేత్తాత విషయాన్ విషవత్ త్యజ।**

**క్షమాఽర్జవం దయాశౌచం సత్యం పీయూషవత్ భజ॥**

**'ముక్తిని కోరుకుంటే విషయవాంఛలను విషంతో సమానంగా భావించి విడిచిపెట్టు. సహనశీలత, ధైర్యం, సరళత, వినమ్రత, విశ్వాసం, ఔదార్యం, దయ, పవిత్రత, సత్యాలను అమృతంలా స్వీకరించు' - చాణుక్యుడు**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

అర్జునుల వారు చేత ధనుస్సును పట్టుకొని నారి సారించి, అపరరుద్రునిలా రథం మీద నిల్చున్నారు ప్రభూ!'

నగరపాలకుడు ఈ వార్తను ప్రభాసానికి పంపడమేమిటి, రాచ పరివారం వేగంగా ప్రభాసం నుండి ద్వారకకు చేరుకోడమేమిటి ఘడియల్లో జరిగిపోయింది.

జరిగిన సంగతి సాధారణమైంది కాదు. బలరాముడు నిలువు నిలువునా మండిపడ్డాడు. తాను దుర్యోధనుని కిద్దామనుకున్న తన సోదరిని అర్జునుడు అపహరించుకుపోవడమా? ఇది యాదవులకే కళంకం.

యాదవుల సమస్యలు 'సుధర్మ' సభలో పరిష్కారమవుతాయి. 'ఇది సమస్త యాదవుల సమస్య' బలరాముడు సభాపాలకుణ్ణి పిలిచి సభను సమావేశపరచమని ఆదేశించాడు.

సభా భవనం పైన ఒక భేరి అమర్చి ఉంటుంది. అది బంగారుతో చేసింది. ఆ భేరి నినదిస్తే ద్వారకా నగరమంతటా వినపడుతుంది. ఏదో ప్రమాదమేర్పడినప్పడే ఆ భేరీని సభాపాలుడు నినదింపజేయిస్తాడు.

భేరీనినాదం ద్వారకా నగరంలో మహా విపత్తును సూచిస్తూ మ్రోగింది. సంధ్య సమయం. యాదవులు ఎక్కడ, ఏ పనిలో, ఏ పరిస్థితిలో ఉన్నా, వేగంగా నడుస్తూ, అశ్వారుఢులై, రథాలపైన వచ్చి, సభా ప్రాంగణం వెలుపలి విశాల మైదానంలో సమావేశమైనారు.

అప్పటికప్పడు అమర్చబడిన ఆసనాల మీద మహారాజు ఉగ్రసేనుల





వారు, వసుదేవ, అక్రూర, బలరామాదులు కూర్చున్నారు. శ్రీకృష్ణుడు బలరాముని సరసనే ఆశీనుడైనాడు.

సభాపాలకుడు లేచి మహారాజుల వారిని సమీపించి, నమస్కరించారు. వారితో క్షణం మాట్లాడాడు. తరువాత వసుదేవుల వారితో వినమ్రంగా సంప్రదించాడు. తరువాత వారి సందేశాన్ని గ్రహించి బలరామునితో క్షణం మాట్లాడి సభ నుద్దేశించి, 'ఈ రోజు రెండు ఘడియల ప్రొద్దుపైకి ప్రాకిన తరువాత శ్రీకృష్ణుల వారి అశ్వాలను పూన్చిన వారి రథం మీద అర్జునుడు ధనువును సారించి నిల్చుండగా, యువరాణి గారైన సుభద్రమ్మగారు నొగల మీద కూర్చుని రథాన్ని మరుద్వేగంతో నడిపించుకుంటూ, రాజవీధులను, నగర ద్వారాలను దాటి రాజమార్గంలో వెళ్లిపోయినారు. యువ రాజవర్యులు గద, సారణుల వారు, ఆ యోధుణ్ణి ఇంద్రప్రస్థ మహారాజు యుధిష్ఠిరుల వారి సోదరుడు, రాజమాత కుంతీదేవి పుత్రుడైన అర్జునుల వారిగా గుర్తించారు. మన యోధులు గద, సారణుల వారి నేతృత్వంలో వెంబడించినా ఫలితం లేకపోయింది. మహాప్రభూ! తమ సన్నిధికి ఈ సమాచారం అందించి, యాదవ సేనను అప్రమత్తం చేశాము' అన్నాడు.

జనంలో కలవరం రేగింది. యాదవుల ముఖాలన్నీ కందబారాయి. వారి ఆత్మాభిమానం అగ్నిశిఖలా జాజ్వల్యమైంది. ఒక్కొక్కరిని తోసుకుంటూ, తమ ఆవేశాన్ని ప్రకటించడానికి ముందుకు దూసుకువచ్చారు.

'ఇది సహించరాని అవమానం' అన్నాడు ఒకడు.

'వెంటనే ఇంద్రప్రస్థం మీద దాడిచేసి, పాండవులకు బుద్ధి చెప్పాలి' అన్నాడు మరొకరు.

కొందరప్పటికప్పడు బయలుదేరడమే శ్రేయస్కరం. పాండవులు సిద్ధమయ్యేలోగా మన దాడి జరగాలన్నారు. 'రథాలు పూన్చండి. అశ్వాలను సిద్ధం చేసుకోండి. శస్త్రాస్త్రాలను సంచయించుకోండి. ప్రయాణానికి సాధన

లను సమకూర్చుకోండి'. సభలో మహోద్రేకం వ్యాపించింది.

బలరాముడు కాలపురుషుడుగా లేచి నిల్చున్నాడు. మెడలో వనమాల, కనులు మైరేయపాశంతో ఎర్రనైనాయి.

'మూర్ఖుల్లా ఆవేశపడకండి. అట్టహాసం చేసి లాభం లేదు. మనం ఇంత సంక్షోభం చెందుతున్నాము. కానీ ఈ జనార్దనుడు ఏ చలనం లేకుండా, హిమఖండంలా శాంతంగా కూర్చున్నాడు. ఆయన భావం ఏమిటో తెలుసుకోకుండా ఈ ప్రగల్భాలు, ఈ గర్జనలు సాధించేదేమిటి? ముందు ఆయన ఏమంటాడో తెలుపనీయండి. తర్వాత ఏమి చేయాలో నిర్ణయిద్దాం'.

బలరాముని మాటల ప్రభావం సభలో కనిపించింది. ఎక్కడికక్కడ సద్దుమణిగింది.

ఏమయ్యా! ఇలా అందరము కలవరం చెందుతుంటే ఏమీ జరగనట్లు మౌనంగా ఎందుకున్నావు? చూచాయగా ఆ తాపసి అర్జునుడని తెలిసినా, నీ కారణంగా అతణ్ణి సన్యాసపూర్వకంగా చూస్తూ వచ్చాం. అతనెవరో మాకు తెలియదని నీవనుకుంటున్నావేమో! కాని అతడు తన గౌరవాదరాలను మంటకలిపాడు. నిన్నూ, మన కుటుంబాన్ని, యాదవ కుల సంఘ గౌరవాన్ని అవమానించాడు. మన శక్తిని ధిక్కరించాడు. దీనిని ఎలా సహించడం? కౌరవ కులాన్ని వేళ్లంట నా హలంతో త్రవ్వి గంగలో కలుపుతాను. నాకు ఎవరి దయా దాక్షిణ్యాలు, సలహా సంప్రదింపులూ, సద్భావమూ అక్కరలేదు'.


సభలోంచి సాధువాదాలు వెడలి యావత్ ద్వారకా నగరాన్ని నిండి, వలయాలై పరిసరాలకు ప్రవహించాయి.

శ్రీకృష్ణుడు బలరాముని ఆగ్రహ ప్రసంగాన్ని శాంతంగా అదే ప్రసన్న ముద్రతో విన్నాడు. నెమ్మదిగా లేచి పెద్దలందరికీ సభకూ నమస్కరించి, బలరాముణ్ణి సమీపించి ఆయన పాదాలనంటి నమస్కరించాడు.

**(సశేషం)**







# సాయి భక్త దాసగణు

**రచన : విజయ కిషోర్**

**(గత సంచిక తరువాయి)**

దాసగణుని చూస్తేనేమో, ఎందరో మహాత్ముల చరిత్రలను అలవోకగా గ్రంథస్థం చేసిన ఆధునిక మహీపతి. తన భగవత్ సంకీర్తనలచే అసంఖ్యాకమైన భావిక భక్తుల హృదయాలలో భక్తి భావోద్వేగాన్ని ఒక వెల్లువలా తీసుకువచ్చి, వారిచే "దాసగణు మహారాజ్"గా మన్ననలు అందుకుంటున్న సంకీర్తనాకారుడు. గొప్ప పారమార్థిక జ్ఞాని! అటువంటి దాసగణుకు, వేదాంతపరంగా ఎంతో నిగూఢమైన, సంక్లిష్టమైన సందేహం కలిగితే, ఆ సందేహాన్ని అవిద్యావంతురాలైన ఒక సాధారణ పనిపిల్ల నివృత్తి చేస్తుంది అని విన్నప్పుడు వారు విస్మయం చెందడంలో వింతేముంది?

కానీ, "బాబా చర్యలు అత్యంత అగాధాలు. ఆయన మాటలు ఎన్నడూ వృథా పోవు" అనే పరిపూర్ణ అవగాహన కలిగియున్న దాసగణు, బాబా మాటలపై సంపూర్ణ విశ్వాసముంచి పార్లేలోని కాకాసాహెబ్ దీక్షిత్ ఇంటికి పయనమయ్యాడు. ఆ రోజు రాత్రికి పార్లేలోని శ్రీ కాకాసాహెబ్ దీక్షిత్ ఇంటికి చేరుకొని, ఆ ఇంట్లోని పనమ్మాయి తన సందేహాన్ని ఎలా తీరుస్తుందోనని ఆలోచిస్తూ, ఎంతో ఆసక్తిగా ఆ క్షణాల కోసం ఎదురు చూస్తూ ఆ రాత్రి నిద్రకుపక్రమించాడు. మరుసటి రోజు ఉదయం దాసగణు పూజలో కూర్చొనియుండగా, ఒక వినసొంపైన గీతం దాసగణు చెవులకు చేరింది. ఆ స్వరంలోని మాధుర్యానికి ముగ్ధుడై, ఆ పాట ఎవరు పాడుతున్నారో తెలుసుకునేందుకై వరండాలోకి వచ్చి ఆసక్తిగా ఆ స్వరం కోసమై అటూయిటూ పరికించగా, పన్నెండు, పదమూడు సంవత్సరాల వయసు కలిగిన ఒక అమ్మాయి అంట్లు తోముతూ, ఆ పాట పాడుతూ తన దృష్టిని ఆకర్షించింది. మనోహరమైన ఆ అమ్మాయి స్వరానికి

ముగ్ధుడై, తన్మయత్వం వలన కనులు అప్రయత్నంగా అరమోడ్పై, దాసగణు ఆ గీతాన్ని ఆలకించసాగాడు.

ఆ పాటలో ఒక అందమైన చీర యొక్క వర్ణన ఉంది. “చీరలోని అందమైన చేతి కుట్టును ఏమని వర్ణించేది? చీర అంచు ఎంత ఆకర్ష ణీయంగా ఉంది. ఆ అంచులోని జరీ ఎంత అందంగా ఉంది” అనేది ఈ గీతంలోని అర్థం! ఆ రోజు ఏదో పండుగ కావడం వలన ఇంట్లోని వారందరూ మంచి ఖరీదైన వస్త్రాలు ధరించియున్నారు. ఆ అమ్మాయిని చూస్తేనేమో, ఒంటిపై చిరుగుల దుస్తులు ధరించింది. కానీ, తాను పాడే పాటలో ఒక ఖరీదైన, అందమైన చీర యొక్క వర్ణన ఉంది. కలలో కూడా తాను కొనుక్కునే పరిస్థితి లేని ఆ చీర మీద తనకున్న మక్కువను, తన పాట ద్వారా చెప్పకనే చెపుతుంది. ఆ అమ్మాయి యొక్క దైన్యమైన స్థితిని చూసి తన హృదయం జాలితో నిండిపోయింది. ఆ అమ్మాయి ఎవరా? అని ఆరా తీస్తే ఆ ఇంట్లోని నౌకరు “నామ్యా” చెల్లెలు అని తెలిసింది. అప్పడు ఆ అమ్మాయి ఆశపడుతున్న జరీ చీరను తనకు అంద జేయాలని నిర్ణయించుకున్నాడు.

దాసగణు ఆ విధంగా ఆలోచిస్తుండగా, తనను కలవడానికి శ్రీ వామన్‌రావు ప్రధాన్ వచ్చారు. ఆనాటి పండుగల సందర్భాన్ని పురస్కరించు కొని, శ్రీ ప్రధాన్ దాసుగణుకు ఒక పంచెల చాపును బహుమతిగా సమర్పించబోతే, దాసగణు శ్రీ ప్రధాన్‌తో “తనకేమి వద్దని, అందుకు బదులుగా ఆ పనమ్మాయికి ఒక మంచి ఎరుపు రంగు జరీ చీరను బహుమతిగా ఇవ్వమని” కోరాడు. అందుకు శ్రీ ప్రధాన్ వెంటనే అంగీకరించి, ఆ విధంగానే ఒక అందమైన ఎరుపు రంగు జరీ చీరను ఆ అమ్మాయికి కానుకగా ఇచ్చారు.

అంతే, ఆకలితో పట్టెడన్నం కోసం పరితపించే వారికి పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించినట్లు, దాహంతో గుక్కెడు నీళ్ల కోసం అలమటించే





వారికి చల్లని స్వచ్ఛమైన కొబ్బరినీళ్ళు లభించినట్లు, ఊహించని విధంగా, తాను కలలు కనే చీర తనకు లభించడంతో ఆ అమ్మాయి మనసు పట్టరాని సంతోషంతో కేరింతలు కొట్టింది. ఆ అమ్మాయి ముఖంలోని ఎనలేని ఆనందాన్ని చూసి దాసగణు, శ్రీ ప్రధాన్ ఎంతో ముచ్చటపడ్డారు. ఆ పండుగరోజు ఆ అమ్మాయి ఆ చీరను ధరించి అందరితో కలిసి ఎంతో సంతోషంగా ఆడిపాడింది. తన మనసులోని ఆనందం అతి స్పష్టంగా తన ముఖంలో, ఆటపాటల్లో వ్యక్తం కాసాగింది. ఒక విధంగా తాను ఆకర్షణకు కేంద్రబిందువు అయింది.

కానీ, మరుసటి రోజు తాను ఎప్పటిలాగానే చిరుగు వస్త్రాలు ధరించి పనికి వచ్చింది. అయినప్పటికీ ముఖంలో మునపటి మాదిరి న్యూనత మాత్రం లేదు. ఆ స్థానంలో ఒక విధమైన ప్రసన్నత ప్రస్ఫుటమవసాగింది. కారణం నిన్న తన వద్ద లేనిది, నేడు తన వద్ద ఉన్నదనే మనఃస్థితి! ఎప్పడయితే ఈ సర్వ ప్రకరణాన్ని దాసగణు వీక్షించాడో, ముఖ్యంగా ఆ అమ్మాయి నిన్న చిరుగు వస్త్రాలు ధరించినప్పడు ఆ అమ్మాయి ముఖం లోని దైన్యత, న్యూనత .... నేడు అదే చిరుగు వస్త్రాలు ధరించినప్పటికీ తన ముఖంలో ప్రస్ఫుటమవుతున్న ప్రసన్నతను పరికించినప్పడు “తక్త్యేన భుంజిథః” అనే వాక్యంలోని గూఢార్థం ఒక్కసారిగా మనోచక్షువుల ముందు సాక్షాత్కారమయింది. హృదయంలో ఒక అవర్ణనీయమైన ఆనందం అనుభవమైంది. తన సందేహ నివృత్తి కోసం ఒక పనమ్మాయి ఉదంతాన్ని ప్రకృతిలో గడించేటట్లు చేసి ఒక విధంగా ప్రతి సృష్టి చేసిన శ్రీ సాయి చరణాల పట్ల అనన్యమైన భక్తి భావం హృదయంలో వెల్లువై కనుల నుండి ధారగా ఆనందాశ్రువుల రూపంలో ప్రవహించసాగింది.

“మొదటి రోజు ఆ పనమ్మాయి వద్ద ఎరుపు రంగు జరీ చీర లేదు. చిరుగు వస్త్రాలు ధరించియుంది. అందువలన తనలో న్యూనత! మరుసటి రోజు చీరను ఇంట్లో పెట్టి, మరలా చిరుగుదుస్తులలోనే వచ్చింది.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

తే.గీ. సాయికి పొగాకు నూనెయు చాలు నోయి
ధనము వెచ్చించి కొనగను - దానకర్త!
మిగులు ధనమంత పంచును మేలుగలుగ
ఊరి వారికి బీదల కుచిత రీతి 16

తే.గీ. రేకు డబ్బాయు కఫినీయు రెండె నాకు
ఆస్తిపాస్తులు యింకేమి యాశ లేదు
వలదు కొనిరాగ విలువైన వస్తుజాల
మనుచు కోపించు భక్తుల గనుచు సాయి 17

తే.గీ. కామినీకాంచనముల సక్తతను సాయి
రాధవాడకున్ పనిసియు, రమ్ము తెమ్ము
దక్షిణ యనుచు భక్తుల దక్షతలను
తెలియజెప్పచు మార్గము దెలుపుచుండు 18

తే.గీ. కామినీ కాంచనములు మోక్షమున కడ్డు
దగులు-ఈషణముల వీడి, తన్మయతను
భక్తిశ్రద్ధల భగవంతు పరము కొఱకు
నిరతము గొలువంగ గలుగు నీకు గతులు 19

## 21. పెండ్లికొడుకు లాగ వేషమేమి

కం. 'నానా' ముఖతా పలువురు
గానామృత దాసగణుని కథలను వినగన్





కానని దూరాల ప్రజలు
రానైరిట భక్తి సాయిరాముని గొలువన్ 1

ఆ.వె. దాసగణుని గాన తన్మయ మహిమన
వ్యాప్తి జెందె సాయి బాబ కీర్తి
భక్తులు శిరిడీకి బారులు దీరుచు
వచ్చు చుండి రిచట వరల కోర్కె 2

ఆ.వె. నిండు పంచెకట్టు-నిడుపైన చొక్కాయు
దానిపైన కోటు-తలకు గుడ్డ
బాగ బిగియగట్టి-భజనచెక్కలు బట్టి
వెడలె హరిదాసు-వేషధారి 2

ఆ.వె. దాస గణుని వేష భూషలు పరికించి
పెండ్లి కొడుకులాగ వేషమేసి,
యేగుచుంటి వెటకు-యెగతాళిగాసాయి
దాసగణుని యనగ దశయుమారె 4

కం. కొందరి కిష్టము హావము
కొందరు మెత్తురు కథలను కొందరు భజనల్
కొందరు వేదాంతములను
అందరి నలరించు వాడె హరిదాసుండౌ 5

ఆ.వె. జోగు తోన  సాయి చోల్కరు కెక్కువ
చక్కెరేసి టీని సరిగ దాప
పనుప చోల్కరు మదిలోన భక్తి పెరిగె
సాయి కెటులదెలిసె శర్క రనుచు 6

**(సశేషం)**

# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

## 1.0 నిత్య మానసిక పరివర్తనయే ముక్తికి మార్గం

- వల్లభనేని కుటుంబరావు

"క్షమాతీర్థం, తపతీర్థం, తీర్థం మింద్రియ నిగ్రహః

సర్వభూత దయాతీర్థం, ధ్యానతీర్థ మనుత్తమమ్ ॥"

దేనివలన సంసార సాగరము తరింపబడునో, దానికి తీర్థమని పేరు. క్షమయే తీర్థం, తపస్సే తీర్థం, ఇంద్రియ నిగ్రహమే తీర్థం, సమస్త ప్రాణుల యందు కరుణయే తీర్థము. అన్నిటికన్నా ధ్యానం అత్యుత్తమ తీర్థం. ఈ గుణములు లేనిచో తీర్థములలో మునిగిన ప్రయోజనం లేదు.

"జలస్నానం మలత్యాగం, మంత్ర స్నానం మనశ్శుచి

భస్మస్నానం హరేత్పాపం, జ్ఞానస్నానం పరంపదమ్ ॥"

నీటిలో స్నానం వలన శరీర మాలిన్యాలు పోతాయి. మంత్రజపం వలన మనసులో మాలిన్యాలు పోతాయి. భస్మం శరీరం అంతటా పూయుట వలన శారీరక తాపం పోతుంది. ఆత్మజ్ఞానం పొందటం వలన ముక్తి లభిస్తుంది.

ఆత్మజ్ఞానియే గృహస్థుని గృహము నుద్దేశించి వెళ్ళునో ఆ గృహస్థుని యొక్క పితృదేవతలందరు పరమగతిని పొందుదురు.

దూడను వెంబడించు ఆవువలె, సదా నారాయణ స్మరణ చేయు భక్తుని భగవంతుడు వెంబడించుచున్నాడని, శివుడు కుమారస్వామికి ఉపదేశించెను.

గంగలో చేపలు, అనేక జలచరములున్నవి. కొంగ మౌనంతో ధ్యానాను ష్ఠానముతో నుండును, శునకము దిగంబరియై బూడిదతో స్నానం చేయును. వీటికి ఏ విశేష ఫలము లభించుట లేదు. జ్ఞానాగ్ని యందు





దహించిన కర్మబీజములచే సంసార వృక్షము నశించి యోగియైనవాడు పునర్జన్మ రహితుడగును.

ఎంతవరకు మనస్సు నశించదో, అంతవరకు వాసనలు నశించవు. ఎంతవరకు వాసనలు నశించవో అంతవరకు మనస్సు నశించదు.

"పరస్య నింద్యాహై శూన్యం దిక్కారంచ కరోతియం

తత్కృతం పాతకం ప్రాప్య, స్వ పుణ్యం ప్రదదాతిసం:"

ఎవరు ఇతరులను నిందింతురో, చాడీలు చెప్పెదరో, అవమానింతురో అట్టివారు ఇతరులు చేసిన పాపములను తాము పొంది, తాము పొందిన పుణ్యం ఇతరులకిచ్చుదురు.

నేడు సమాజంలో జరుగుతున్నది ఇదే. అయితే ఇద్దరూ తిట్టుకుంటే ఫలితం ఎవరికీ రాదు.

"వైరాగ్యం లేని వానికి జ్ఞానం భారం

శాంతి లేని వానికి మనస్సు భారం

తత్త్వజ్ఞానం లేని వానికి శరీరం భారం".

అన్ని దానములలోకి బ్రహ్మజ్ఞాన దానం అత్యుత్తమం. అంతఃకరణములో గల అవిద్యను తొలగించి, ఆత్మ సాక్షాత్కారము కలిగించునది ఇది ఒక్కటే.

స్నానం చేయునప్పుడు, భోజనం చేయునప్పుడు, హోమం చేయు నప్పుడు, జపం చేయునప్పుడు మౌనంగా ఉండవలెను.

ప్రతి మనిషికి అంతర్గత శక్తి ఉంటుంది. దీనినే లేటెంట్ పవర్ అంటారు. దీనిని మనం పట్టించుకోము. మనవల్ల కాదులే అను కుంటాము. మన ప్రారబ్ధకర్మ మనం ఏమీ చెయ్యలేము అనుకుంటాము. కానీ, స్వామి యోగానందా, వివేకానందా, బుద్ధ భగవానుడు "మనం మన ఇచ్ఛాశక్తి (విల్ పవర్)తో మన ప్రారబ్ధకర్మను అధిగమించవచ్చును" అన్నారు. సైన్స్ పరిశోధనలు కూడా వీటిని నిర్ధారించాయి.

ఒక్క మనిషికి మాత్రమే తన ఆలోచనలను, తన నమ్మకాలను, తన

అనుభవాలను మార్చుకొనే శక్తి ఉంది. మన అవగాహనను (పెర్‌పెన్షన్) మనం ఖచ్చితంగా మార్చుకోవచ్చును. మిగతా జీవులకు అంటే మృగాలకు, పక్షులకు ఆ శక్తి లేదు. అవి వాటి ఆలోచనలను మార్చుకోలేవు.

ఇంకా వివరంగా చెప్పాలంటే మన డి.ఎన్.ఎ.ని మనం మార్చుకోవచ్చు. దీని మీద కూడా పరిశోధనలు జరిగాయి.

జ్ఞానం వైపు మనస్సు మళ్ళించి నేర్చుకున్న జ్ఞానం ఆచరణలో పెట్టాలి. సమస్త భావాలనూ శుద్ధి చేయాలి. అపుడు పరిశుద్ధతకు రూపమైన ప్రేమ, కరుణ, దానం, సహనం, క్షమ, సేవాభావం పెంపొందుతాయి. ఉద్రేకం, కోపం, ద్వేషం, అసూయ, భయం సమస్తం ప్రేమ, కరుణ, దానం, సేవ ఆచరణ ద్వారా పోతాయి. పనిలో ఆనందాన్ని వెదుక్కోవటం ఆధ్యాత్మికత. అన్ని జీవులలో ఒకే దైవం ఉంది. కాబట్టి మానవసేవయే మాధవసేవ. అన్ని కర్మలు బ్రహ్మార్పితం చేయండి.

మనిషి అభిమానరహితంగా వ్యవహరించినపుడు ప్రేమ ఉత్పన్నం అవుతుంది. ఆత్మజ్ఞానం శ్రద్ధ ఉన్నప్పడే సాధ్యం అవుతుంది. కర్మల వల్ల బంధం ఏర్పడుతుంది. ఎలాంటి మమకారం లేకుండా కర్మాచరణం చేస్తే బంధం ఉండదు.

జీవితంలో సరైన పాఠం, సరేలే పోనీలే అనేది - అది కోపమైనా, ద్వేషమైనా, అసూయైనా అహంకారమైనా సరే.

నోరు తెరచి మాట్లాడే ముందు మనస్సు విప్పిచూడు. నీ ప్రశాంతత అనేది ఇతరులను జడ్జి చేయటం వలన రాదు. క్షమించటం వలన వస్తుంది. సంతోషంగా జీవించటం అంటే అన్నిటిని పొందటం కాదు, ఉన్నదానితో తృప్తిగా జీవించటం. ఎల్లప్పడు మంచి ఆలోచనలు మనస్సుకు పంపించాలి. గొప్ప మనస్సుకు ఆశయం ఉంటుంది. చిన్న మనస్సుకు కోరికలుంటాయి.

నీ మనస్సు దేనిని స్వీకరిస్తుందో అదే నీ జీవితాన్ని నియంత్రిస్తుంది.

**(సశేషం)**





# మాతృసంస్థ కబుర్లు

ఆషాఢ శుద్ధ పౌర్ణమిని గురుపూర్ణిమ అనీ, దీనినే వ్యాస పూర్ణిమ అని అంటారు. అద్వితీయమైన గురు పరంపరలకు ఆలవాలం మన భారత దేశం. గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా పూజించే మహత్తరమైన జాతి మనది. గురుపూర్ణిమను పరమ పవిత్ర దినంగా జరుపుకుంటాము. ఈ సంవత్సరం గురుపౌర్ణమి జూలై 3వ తేదీన వచ్చింది.

సాయిధామం ఆశ్రమంలో ద్వారవతి సాయి దేవాలయానికి “27” వసంతాలు నిండిన సందర్భంగా మూడు రోజులు కార్యక్రమం చేయవలసిందిగా సాయిదత్త పీఠాధిపతులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు సంకల్పించారు.

మూడు రోజులు కార్యక్రమంలో మొదటి రోజు అనగా జూలై 1వ తేదీ తెల్లవారుజాముననే కార్యక్రమం మొదలయ్యింది. 5 గం.లకు కాకడ హారతి, 7 గం.లకు సాయినాథుల వారికి దత్తాత్రేయుల వారికి క్షీర, జలాభిషేకాలు నమకం, చమకం రుద్రంతో, సాయినామాలతో సాగింది. గం.7.30లకు ప్రత్యేక అలంకరణ, సాయి మారుతికి తమలపాకులతో అష్టోత్తర శతనామ పూజ జరిగాయి.

ఉదయం గం.9.00లకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి కరకమ లములచే ధ్వజారోహణ, ప్రార్థనా కార్యక్రమం జరిగాయి. గం.10.00లకు శ్రీ దత్తాత్రేయుల వారి చరిత్ర పారాయణ. ఎవరు అదృష్టవంతులో వారు నా పూజ చేసుకుంటారని బాబా చెప్పారు కదా. అతి కొద్దిమంది మాత్రమే ఈ పారాయణలో పాల్గొని తరించారు. కోరిన కోరికలను తీర్చే భక్తుల కొంగు బంగారం దత్తాత్రేయుల వారు. వారి శక్తిని భక్తులందరూ పొందాలి, తరించాలి. సాయంత్రం 6 గం.లకు దత్తాత్రేయుల వారి చరిత్ర పారాయణ ముగింపు కార్యక్రమం జరిగింది. పారాయణ

చేసిన భక్తులందరూ ఏదో శక్తి వారిని ఉత్తేజితులను చేసిందనీ, ఈ పారాయణ మాకు చాలా ఆనందాన్ని ఇచ్చిందనీ చాలా సంతోషించారు.

సాయంత్రం గం.7.00లకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. అనంతరం శేజారతితో కార్యక్రమం ముగిసింది.

జూలై 2వ తేదీ రెండవ రోజు సాయినాథుల వారికి ప్రాతఃకాల కాకడ హారతి అనంతరం 6 గం.లకు శ్రీ సాయి నామం అర్ధ ఏకాహం ఉద్ధమర్రి గ్రామ భక్తులచే ప్రారంభం అయ్యింది. ఈ ఏకాహంలో ఆరు గ్రామాల భజన మండళ్ల భక్తులు పాల్గొని తరించారు. సాయంత్రం గం.7.00లకు ఫక్కీరు గూడెం శ్రీ రామాంజనేయ స్వామి భజన, భక్త బృందం విచ్చేసి రెండు గంటలపాటు భజనలు, కీర్తనలు భక్తి ప్రపత్తులతో చేసి సాయిధామం ఆశ్రమంలో సాయి ప్రసాదాన్ని స్వీకరించి తరలివెళ్ళారు.

3వ రోజైన గురుపూర్ణిమనాడు ఆశ్రమంలో దైవనామం వినిపిస్తూ పండుగ సందడి నెలకొన్నది. ఊరంతా దైవనామం వినిపించేలా మైకులు, భక్తుల కోలాహలం మొదలయ్యింది.

వేకువజామున గం.5.15 ని.లకు సాయినాథుల వారికి కాకడ హారతి, గం.6.00లకు పంచామృతాలతో క్షీరాభిషేకం, సహస్ర ఘటాభిషేకం కన్నుల పండువగా జరిగింది. బాబా వారికి ప్రత్యేక పుష్పాలంకరణ అనంతరం ప్రత్యేక పూజ జరిగాయి. ఉదయం గం.9.00లకు ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన సురభి గోశాల ఉగ్రాణం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి రసాయన ఎరువులు, పురుగుల మందులకు బదులుగా గో ఆధారితమైన ఉత్పత్తులు వాడటం వల్ల పర్యావరణం బాగుపడుతుందనీ, స్వచ్ఛమైన ఆవు నెయ్యి, కట్టె గానుగలతో తీసిన నూనెలు వాడటం వల్ల దీర్ఘకాలం మనిషి ఆరోగ్యంగా ఉండవచ్చుననీ, అకాల మరణాలు సంభవించవనీ, ఆ ఉద్దేశ్యంతోనే సాయిధామం ఆశ్రమంలో గోఆధారిత ఉత్పత్తులు తయారు చేసి అందరికీ మేలు కలగాలనీ, దానికోసమే ఈ ఉగ్రాణ నిర్మాణం జరిగినదనీ, ఈ ఉగ్రాణ నిర్మాణానికి సహకరించిన భక్తులకు సాయినాథుని పరిపూర్ణ





ఆశీస్సులు, గోమాత ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలనీ సెలవిచ్చారు.

సాయి దేవాలయం భక్త జనులతో నిండిపోయింది. బాబా వారికి జరిగే సహస్ర నామార్చనను కనులారా వీక్షించాలనీ, ఆయన కరుణా కటాక్షాలు పొందాలనీ దూరతీరాల నుండి తరలివచ్చారు. సాయి నాథుల వారికి జరిగే సహస్ర నామార్చనకు రంగురంగుల పుష్పాలను బుట్టల నిండా సిద్ధం చేసినారు. పూజ మొదలయ్యింది - శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు సహస్రనామాలు చదువుతుండగా, భక్తులంతా ఓంకార నాదంతో దేవాలయం ప్రతిధ్వనించింది.

అనంతరం గురుపాదుకా పూజ కార్యక్రమంలో స్వామీజీ వారు గురువుగారి యొక్క విశిష్టతను వివరిస్తూ - మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన జ్యోతులను వెలిగించువాడే గురువు. ఈ పవిత్ర దినాన గురుపాదుకా పూజ చేసుకోవడం మన అందరి అదృష్టం. అలాంటి సద్గురువులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీసత్యపదానంద ప్రభుజీ వారి చిత్రపటానికి ఆశ్రమ ట్రస్టీలైన డా॥ జి.చంద్రారెడ్డిగారు, శ్రీ బూర్లగడ్డ గోపీకృష్ణ, గురువుగారి ముఖ్యశిష్యులచేత గురుపాదుకా పూజ చేయించారు. అనంతరం భక్తులచేత పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వచ్చిన భక్తులంతా స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించి ఆనందంతో తరలివెళ్ళారు.

జూలై 15వ తేదీన శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీ శివస్వామి వారి ఆహ్వానం మేరకు సాయిదత్త పీఠాధిపతులు, సాయిధామం ఆశ్రమాల నిర్వహకులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ మహరాజ్ వారు లాల్‌దర్వాజాలోని మహంకాళి అమ్మవారికి సుమారుగా వెయ్యిమంది మహిళా కార్యకర్తలతో **'చీర, సారె మనసారా'** అనే కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి సారె సమర్పించడం జరిగింది.

జూలై 17వ తేదీ పూజ్య గురుదేవుల ఆశీస్సులతో ఆషాఢ మాస అమావాస్య సందర్భంగా నిర్వహించిన సామూహిక గోపూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న భక్తులందరికీ గోమాత సంపూర్ణ ఆశీస్సులు లభించాలనీ వారి మనోభీష్టం నెరవేరాలని ప్రార్థిస్తూ ..... జై గోమాత.